# సాంధ్య రాగంలో సావిత్రి

"ప్రభు"

కథానిక

అసలీ కథ నీతోనే చెప్పాలనుకున్నాను.

కానీ, నువ్వు వెళ్ళిపోయావు నాకు కనబడకుండా.

*    *    *

బావనీ, అక్కయ్యనీ ఒకసారి చూసి పోదామని వొచ్చాను ఆ వూరు. ఓ విధంగా, అదే నాకు రెండు సంవత్సరాల కష్టం తరవాత విశ్రాంతి. రోజూ ఏడుగంటలు ఆఫీసులో కూర్చుని ఆ కాగితాలతో బాధపడుతూ ఒక్కవారం విశ్రాంతి లేకుండా ఇరవైనాలుగు నెలలు గడిపేను—ఇక విశ్రాంతికోసం మనస్సు ఆరాటపడింది.

రెండూ కలిసి వొస్తాయని మీ వూరు ఎంచుకున్నాను. వాళ్ళకన్న ఆప్తులు లేరు — ఆ వూరూ చక్కగా అడవి అంచున చిన్న కొండలమధ్య ఉంది. గోలచెయ్యని రైల్వేస్టేషను. చిన్న చిన్న దుకాణాలు. నిజంగా ప్రశాంతంగా ఉండే సాయంత్రాలు. నిశ్శబ్దంగా కూర్చుని చదువుకోడానికని నాకు మేడమీద గది. అన్నీ ఉన్నాయి, రమ్మని రాసింది అక్కయ్య. సెలవుతీసుకుని బయలుదేరేను.

ఉదయం ఏడున్నరకి ఆ చిన్నస్టేషనులో దిగిపోయాను. అంతా ఏదో వింతగా కనిపించింది. ఎందుకాగిపోయిందో తానే అనుమానిస్తోన్నట్లు తెల్లబోయి నెమ్మదిగా వెంటనే సాగిపోయింది రైలు. నాకోసమని రైలుకి బండీ పంపేరు మావాళ్ళు. బావ పదిలోపున లేవడుగా!

ఊరికీ స్టేషనుకీ చాలా దగ్గిరే. ఒక మైలుకన్న ఉండనే ఉండదు. చెట్లలో కనిపించక కాని, అంతా ఒకటేచోట ఉన్నట్లుంది.

రాత్రంతా బాగా నిద్రపోయానేమో, ఉదయాన నుంచి హాయిగా వుంది. ఆ గతుకుల బాటలో ప్రతీ అంగుళాన్నీ, అంగుళంలో ప్రతీ గతుకునీ లెక్కవేసుకుంటూ సాగిపోతూంది బండీ. అయినా నాకు చిరాకు వెయ్యలేదు. చెట్లనీడల్లో చల్లటి గాలి తగిలి వొంటికి క్రొత్తజన్మ వొచ్చినట్లనిపించసాగింది. చుట్టూ చిన్న చిన్న కొండలు; ఊరికి చేరేలోపున మూడు చిన్ననదులు దాటేం. అంతా ఏదో విచిత్రప్రపంచంలోకి జారిపోయినట్టు ఉంది. చిన్నపిల్లాడిలాగ మనసులో ఆనందం ఉరకలు వెయ్యసాగింది.

అప్పటికి నిన్నుగురించి నాకేం తెలుసు, సావిత్రీ? నేను మానసిక విశ్రాంతికోసమే అక్కడికి ఒస్తున్నాననుకున్నాను. ఆ చెట్లనీడల్లో, సెలయేర్లల్లో, ఈ కొండల్లో తిరిగి మళ్ళా కొంతకాలం మానవుడిగా అయిపోదాం అనుకున్నాను గాని, అక్కడ నా జీవిత రహస్యం, నానుంచి దాగిన నా నిజం, నువ్వు బయటపెడతావనీ, ఆ తలుపులు తెరిచినందుకు నువ్వూ, ఆ ద్వారాలూ నావైనందువల్ల నేనూ నిప్పుల్లో స్నానం చేస్తామని నేను ఎలాగ కలగనేది! నీ పేరేనా నాకు తెలీదు సావిత్రీ— ఆ ఉదయం!

రాబోయే నెలరోజుల ఆనందాన్ని గురించి ఎన్నెన్నో ఊహించుకున్నానుగాని, నా జీవితంలోకే హృదయం ఉన్న అమ్మాయి వొస్తుందని నాకు తట్టలేదు. అక్కడ కొండలూ నదులూ మాత్రమే నాకు తెలిసినవి-అప్పటికి.

*    *    *

అక్కడికి వొచ్చిన మూడోరోజు సాయంత్రం షికారుగా బయలుదేరేను-ఆ రోజు ఉదయం నువ్వెందుకనో మా ఇంటికి వొచ్చావుట.

"పాపం! ఆ అమ్మాయి బ్రతుకంతా గంగలో కలిసిపోయింది!" అన్నది అక్కయ్య నిన్ను తలుచుకుని.

"ఏం?" అన్నాను-ఎంతో మూర్ఖంగా.

"పెళ్ళిపీటలు దిగకుండా భర్తపోయాడు" అన్నది.

"తిరిగి పెళ్ళి చేసుకోలా?" అని అడిగేను-మనసులోనే రూపం ఊహించు

కుంటూ. నువ్వెలా ఉంటావో ఆ క్షణంలో తెలిసిపోయింది.

"లేదు."

మరి ఇంక నిన్ను గురించిన ఆలోచనలు సాగలేదు. ఏదో పాట రేడియోనించి వింటూ అలా నిన్ను వొదిలేశాను.

సాయంత్రం ఆ గుట్టకి అవతల తోటలోంచి వెడుతోన్న ఏరు వొంపులో కూర్చుని తిరిగి నా ఆలోచనలలో పడ్డాను. కొంచెం సేపయాక హఠాత్తుగా కొంచెం అవతల నీళ్ళు కదిలిన చప్పుడూ నువ్వూ కనిపించారు.

అప్పటిదాకా నన్ను నువ్వు చూడలేదు, నువ్వెవరో నాకు తెలీదు.

తెల్లబోయి నువ్వు నా వొంక చూశావు.

బాగా జ్ఞాపకం ఉంది. నీ నీడని నీటిలో చూసుకుంటూన్నట్టు వొంగి నీటిలో సాగిపోతోన్న కర్రముక్కల వేపూ, అక్కడా, నృత్యం చేస్తోన్న సుడుల వేపూ నువ్వు చూస్తూ ఉండి ఉండి ఒక రాయి విసిరావు. అదే శబ్దం.

ఎండ నీమీద పడలేదు. అందుకని నువ్వు ఎండిపోయిన కళ్ళతో ఆలోచిస్తున్నావో, ఆలోచిస్తూన్న కళ్ళతో ఏడుస్తున్నావో నాకు, తెలీలేదు. కాని, ఆ ఏకాంతపు బరువు భరించలేక నీ దుఃఖాలు నీనుంచి ప్రవహిస్తోన్నట్లూ, ఆ బరువుతో నువ్వూ ఆ వాహినిలో పడిపోయినట్టూ అనిపించింది నాకు. మెరుపు మల్లే తెల్లటి మేఘాల మధ్య నల్లటి విద్యుల్లత మెరిస్తే ఎట్లా ఉంటుందో! అలాగ అనిపించావు నువ్వు.

ఒక్కసారి నా గతమే నాకు జ్ఞాపకం వొచ్చింది, సావిత్రీ! అందుకనే ఆ క్షణంలో నీ చీకటి మెరుపు నాకు ఎంతో అందంగా కనిపించింది. ఒకప్పుడు నేనూ ప్రేమించగలిగాను... ఆమె వెళ్ళిపోతూ ఒక క్షణం నాకు దొరికింది- ఆకాశం నించి జారిపోతూన్న నక్షత్రంలాగా-ఆ ఒక్క క్షణం నా జీవితంలో ఉన్న అత్యుత్తమ క్షణం అయిపోయింది. కాలం బలవంతాన లాగేస్తోన్నా, మరీ బలంగా ఆ క్షణాన్ని హృదయంలో దాచుకుని పెనుగులాడుతోన్న నాకు నువ్వూ నది ప్రక్కన నా హృదయంలోనించి నడిచి వెళ్ళి అక్కడ కూర్చున్న సావిత్రివై పోయావు.

జ్ఞాపకం ఉందా? ఒక్కసారి కుదించుకు పోయావు.

అప్పటికే బాగా మత్తెక్కిపోయి, గాలిబుడగ మల్లే అయిపోయిన నాకు నీ అసహ్యం, అనుమానం కనిపించి ఒక్కసారి దిగజారి పోయాను.

కాని, ఏం చెయ్యనూ?... నీ నల్లటి కళ్ళ వెనకాల ఉండిపోయి గడ్డ కట్టుకున్న బాధ నాకు తెలుసు... నీ కళ్ళల్లోకి చూడకుండానే, ఆ నీడలోనే నిన్ను చూసి ఆ విషయం అర్థం చేసుకున్నాను. ఏమనుకున్నావో నాకు తెలీదు. ఏం చెయ్యదలుచుకున్నావో నాకు తెలీదు. అట్లానే నీ వొంక చూస్తూ ఉండిపోయ్యాను. నువ్వు కోపంగా లాగ నదివైపు చూస్తూ అలాగే కూర్చున్నాను. నది తనదారి తాను వెతుక్కుంటూ సాగిపోతూంది.

కొంచెంసేపు నిన్ను చూశాక ఇంక అనుమానమే లేకుండా తెలిసిపోయింది సావిత్రీ!...ఎప్పుడో విడిపోయిన మనం మళ్ళీ కలుసుకున్నాం అని. నువ్వేమంటావో అనే ఆలోచనే రాలేదు నాకు— లేచివొచ్చి నీ ప్రక్కన కూర్చున్నాను. అందుకే ఎదురు చూస్తోన్నట్లు.

చాలాసేపు నువ్వు మాటలాడలేదు. అసలెన్నటికీ మాట్లాడవేమో ననుకున్నాను. ఏదో నేరం చేసి నీ కన్యాయంచేసినట్టూ, నీకు కోపం వొచ్చినట్టూ అనిపించి మరీ బాధ పడ్డాను.

"మీరెవరు?" అన్నావు, ఆలోచనగా, బాధగా.

నేను నవ్వుకున్నాను... ఏడవలేక ఆ కొద్ది నిమిషాల మన పరిచయం జన్మజన్మల స్నేహమైపోయి. తరతరాల ప్రణయమైపోయి ఆ సముద్రంలో ఈదుతోన్న నన్ను గాలంతో వెలికితీసి పరీక్షిస్తోన్నట్లు ఒక్కసారి నా చేతుల్లోంచి నడిచి వెళ్ళిపోయి నువ్వు తెలివి తెచ్చుకున్నట్లు... నాకు దూరం అయిపోయి, నాకు నన్నే శత్రువుగా చేశావు. ఇంక ఏం చేసేదీ!

ఆరోజింక బ్రతకాలనిపించలేదు.

నా మనసు విడమరచి చెప్పాలనుకున్నాను... నా గుండెలలో మండుతోన్న వేడి; నీ హృదయంలో ఏదో దవానలం... మనకన్న సన్నిహితులెవరని! నీకు నేను రక్షకుణ్ణి; మిత్రుణ్ణి; అన్నీ...

అంతా. ఆ తాపంనించి నిన్ను తప్పించమని ఎవరో వొప్పగించిన అమూల్య ప్రాణానివి నువ్వు...

ఆ ఆలోచనల మబ్బుల్లో నన్ను వొదిలేసి సుడిగాలి మల్లే చివాలున లేచి వెళ్ళిపోయావు. నువ్వట్లా చీదరించుకుని వెళ్ళిపోతూంటే ఎన్ని మృత్యువులో నన్ను గుచ్చుకున్నాయ్... స్తబ్ధుడనైపోయి కదల లేక పోయానుగానీ, ఆలోచనల్లో నీ కాళ్ళకి చుట్టుకుని నా మనస్సులోని వ్యథల సంకెళ్లు వేసి నిన్నా సుందర పరిసరాలలో ప్రతిష్ఠించుకున్నాను. నాకథ అంతా చెప్పాను... నా మనసులో ఉండిపోయిన శిథిలాలతో ఇల్లుకట్టి నిన్నందులో దాచుకున్నాను... కానీ, ఏం చేసేదీ?... నువ్వట్లా వెళ్ళిపోయావు ఆరోజు—

ఇదంతా ఎందుకని నీతో చెప్తున్నానో!

అయినా ఆ రోజు ఎట్లా గడిపానో నీకు చెప్పను. ఆ సాయంత్రం మనసు వెయ్యి బలాలతో నన్ను మళ్ళా ఆచోటికి తీసికెళ్ళబోయింది... కాని, హృదయం బుద్ధిచెప్పి నన్ను కదలనీకుండా చేసింది. అట్లానే ఊగులాడుతూ ఉండిపోయాను. కాని...

అదంతా నీకు తెలిసిందే. పిచ్చిగావొచ్చి నీకు ఈ వేదనల నిప్పుల్లో కరిగిన నా మనస్సుని చూపాలని ఆత్రుత. అంతే చేశాను. ఈరోజు ఆ సంభాషణ నాకు జ్ఞాపకం ఉంది పూర్తిగా. కానీ, అంతకన్నా, నీ కళ్ళవెనకాల దాగిన ఆ దుఃఖం పూర్తిగా గమనించి ఒక్కసారి నా జీవితం తిరిగి నాకు వొచ్చినంత ఆనందపడ్డాను... నీకూ తెలుసు సావిత్రీ... నీ దుఃఖం చూసికాదు... మన సన్నిహితత్వంచూసి నాదగ్గరగా నువ్వు వొచ్చావని.

ఆ రోజు మనం వొదిలి వెళ్ళలేకపోయాం... మరిచిపోయావా?

* * *

అట్లానే మనం మరీ దగ్గరగా వొచ్చివొచ్చి కలిసిపొయ్యాం... నీ మనసంతా నాకు తెలుసు నా మనసంతా నీకు తెలుసు. ఈ అనుభవాన్ని ఎంతో విలువతో, ఆప్యాయంగా దాచుకున్నాను నేను. క్షణక్షణమూ నిన్ను తలుచుకునే వాడిని... నీ ఆలోచనలు నాకు తెలుసు .. నా ఆలోచనలు నీకు తెలుసు...

సాయంత్రాలు మనం నిశ్శబ్దంగా కూర్చుని, వెళ్ళిపోయేవాళ్ళం. ఏమీ మాట్లాడుకోనేందుకు మిగలనూలేదు; అక్కరాలేదు.

కాని, యిప్పుడు నీతో నేనే చెప్పుకుంటున్నాను సావిత్రీ! కొద్దిరోజుల తరువాత అట్లానే కూర్చోలేకపొయ్యావు.

హఠాత్తుగా నవ్వావు. సముద్రపు నురగల మాలికలలాగా ఎందుకనో!

నేను తృళ్ళిపడి నీవొంక చూశాను. నా తత్తరపాటు చూసి నువ్వు మరీ నవ్వసాగావు.

"ఏమిటది?" అని నిన్నడగలేకపోయాను.

కొంచెం సంబాళించుకుని, "ఏం మనుషులం?" అన్నావు, విచిత్రంగా. ఎందుకనో ఆ క్షణం ఎంతో పవిత్రమైన దైవాలయంలోనించీ ఒక్కసారి పానశాలలోకి జారి నృత్యం చేస్తోన్నట్లవుపించావు నువ్వు నాకు.

"ఎందుకనీ ఇట్లా కూర్చోడం?" అన్నావు.

నీకేదో గాలిసోకిందనిపించింది నాకు. నీ అగాధ ప్రశాంతతా, దాగిక్రింది ఆ బడబానలం, ఆవేదనల నిశ్చలత్వం—అన్నీ నశించిపోయి ఒక్కసారి నీ తరంగాల సంచలనంలో ఈ అందాల నురుగులని మాలికలుచేసి, వాటితో అలంకరించే ప్రియుడికోసం వెతుకుతోన్నట్లనిపించావు నువ్వు నాకు.

ఏమో చెప్పావు నాకు...

అక్కడా అక్కడా జ్ఞాపకం ఉంది.

నామీద నీ అభిమానాన్ని వ్యక్తపరిచావు. నీ చీకటి తెరలని తొలగించా నన్నావు. నీ గత దుఃఖాల చిన్నెలు నీ గాద్గదిక కంఠ స్వరంలో అప్పుడూఅప్పుడూ ప్రతిఫలించినా, వెనువెంటనే ఆ దుఃఖాలు తొలిగిపోయిన సంతోషం నీ మాటలకి ఏదో తేలికదనాన్ని ఆపాదించింది. అప్పటిదాకా నా హృదయంలోనే వాడిన ప్రతీ మాటనీ నువ్వు వ్యక్తపరిచిన ప్రతీ ఉద్దేశాన్నీ అమూల్యంగా దాచుకొంటున్న నా చెవులనించి ఈ మాటలన్నీ తేలిపోయి తప్పించుకుని వెళ్ళిపోసాగాయి.

నీకు నూతనంగా ఏమి దొరుకుతుందో తెలీదు.

కాని నాకు దొరికిన ఒక్క మనసూ జారిపోయింది నా చేతులు సున్నితపు పట్టు విడిపించుకుని.

నీ ఆనందంలో, నీ హృదయపు తేలికదనంలో నేను పాలు తీసుకోలేకపోయాను. నువ్వు చిన్న బుచ్చుకున్నావు. అది ఎంత దాచినా దాగదు.

*  *  *

ఆ తరవాతా నువ్వక్కడికొచ్చి కూర్చుంటావని నాకు తెలుసును... కాని, నేనే పిరికివాడినయి అక్కడికి రాలేకపోయాను. నీకు తెలియకుండా చెరువునించి వచ్చేటప్పుడూ, మా ఇంటికి వొచ్చే టప్పుడూ నిన్ను చూసేవాడిని. ఆ సాయంత్రపు సావిత్రి నీలోనించి త్వరగా మాయం అయి పోయింది. నువ్వు విలాసవతివి; నువ్వు సౌందర్య వతివి; నువ్వు యువతివి; కానీ నాకు కావలసిన సావిత్రి నీలోలేదు.

ఆమెకోసం ఇంక వెతకగలనని నాకు తెలీదు. అందుకనే నీదగ్గరకి రాలేకపోయాను.

అట్లా కొంచెం రోజులయాక నువ్వు పెళ్ళి కూతురు వయ్యావు.

*  *  *

ఒక్కసారే అయినా, జీవితంలో నాకు హృదయం ఉన్న ప్రయోజనం చేకూర్చావు నువ్వు. పాతుకుపోయిన బురదలలోనించి క్షణి కంగానే అయినా వెలికి తీశావు నన్ను. తిరిగి నా చేతులలోనించి జారిపోయినా, నా మనసుకి ఎంతో దగ్గిరిగా కొచ్చావు నువ్వు. ఇప్పుడు పూర్తిగా అపరి చితులమే ఐనా కొంచెం క్షణాలు నా మనసులో నీ హృదయం ఆలోచించింది; నీ హృదయంలో నా మనసు విశ్రాంతి తీసుకుంది.

ఆ కొద్ది సుఖం దాచుకోలేక ఆ సాయంత్రం వొచ్చి కూర్చున్నా నక్కడ...ఆ ఏటి వొడ్డును నిప్పుల మధ్య నిప్పులు పోస్తే బాధ ఎవరికని! నేను నీ తలపులతో నాకేదో అవకాశం జరిగిందని బాధ పడలేదు. కానీ, నీ నుంచి నువ్వెంత దూరంగా వెళ్ళి పోయానో తలచుకొని బాధ పడ్డాను.

ఆ సంజవేళ అక్కడికి నువ్వెందుకని వొచ్చావో!

నీతో ఎవ్వరూ లేరు...కాని, ఏదో పెద్ద సమూహంతో వొచ్చి నాతో కలహించేందుకు సంసిద్ధవైనట్లు భయపడి పోయాను నేను. నీ కళ్ళలో అసహ్యం లేదు; భయమూ లేదు. కాని నీకెంతో కోపం వచ్చినట్లు హడలిపోయాను నేను. అట్లానే నిలబడ్డావు నువ్వు నావంక చూస్తూ. నీలో వచ్చిన మార్పుకి నిశ్చేష్టుడినైపోయి మూగి నయి పోయాను నేను.

ఇదంతా నీతో చెప్పాలని తహతహ: కానీ! నోరు తిరుగదు. మాట రాలేదు- కదలలేక పోయాను... అట్లనే ఉండి పోయాము మనం.

అప్పుడు—నువ్వు వెళ్ళిపోయావు...మలయా నిలంమల్లే. అప్పుడు కూడా నేను పిలవలేక పోయాను...

*  *  *

నువ్వేమనుకుంటున్నావోనని నా బాధ...

ఉన్నది చెప్పి తేలిక పడాలని కోరిక.

అందుకనే అసలిదంతా నీతోనే చెప్పాలను కున్నాను—

కానీ, సావిత్రీ!,' నువ్వు వెళ్ళి పోయావు— కనపడకుండా. ★

---

(8వ పేజీ తరువాయి)

వేరుసెనగ, ఎగుమతులమీద విదేశ కంపెనీలు విపరీతంగా లాభాలు తీస్తున్నవి. పొగాకుమీద కేంద్రం పొందుతున్న ఎక్సయిజ్ సుంకంలో ఆంధ్రకు న్యాయమైన వాటా రావడం లేదు కూడా. హైదరాబాదులో వేరుసెనగ మీదను, నువ్వుల నూనె, తెలగపిండి, ఆముదం గింజలు, బీడీ ఆకులు, తోళ్ళను చదును చేయడానికి విని యోగించే తుమ్మ చెక్కమీద కొనుగోలు పన్ను విధించబడుతున్నది. కనక రేపు ఆంధ్ర-తెలంగాణా రాష్ట్రం ఏర్పడినప్పుడు ఈ రెండు ప్రాంతాల పన్నులను సమన్వయపరచవలసి వుంటుంది కనక యిప్పుడే తగు జాగ్రత్తలుపడడం మంచిది కూడా: ఇక ఆంధ్ర ప్రభుత్వ ప్రతిపాదనలలో రెండవ లోపం డీలర్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించినది. అందరూ డీలర్లు అనికాక, హైదరాబాదులోవలె అయిదువేల రూపాయల రూపాయలకు మించిన టర్నోవరు కలవారిని నిర్బంధంగా రిజిస్టరు కావాలని షరతు పెట్టి, ఏడున్నరవేలకు మించినవ్యాపారం చేసే వారిమీద కొనుగోలుపన్ను విధిస్తే, గ్రామాల లోని సన్నరకం ఖాయిదావ్యాపారులకు సహాయం జరుగుతుంది.—"గౌరీశంకర్"